




*వివాహ వేడుక విధివిధానంలో పాటించవలసిన సాంప్రదాయాలు, ఆచారాలతో పాటు 'వధువు అలంకరణ' కూడా ప్రాధాన్యత సంతరించుకుంటుంది. బ్రహ్మస్థానమైన నుదిటి పై వివాహిత ప్రతిదినం కుంకుమ దిద్దితే.. భర్త ఆయుష్షు పెరుగుతుందని, శుభాలు కలుగుతాయని చెబుతుంది మన సంస్కృతి.*

*ఆచార సాంప్రదాయాలని అనుసరించి పాణిగ్రహణ సమయంలో ఉచ్ఛరించిన పెళ్లి ప్రమాణాలు 'పదికాలాల పాటు నిలబడతాయని, వైవాహిక జీవితం అన్యోన్యంగా సాగుతుందని సూచిస్తుంది మన సాంప్రదాయం.*

★★

*విభిన్న కుటుంబ నేపథ్యాల నుండి భిన్న మనస్తత్వాలు కలిగి ఉన్న ఐదుగురు అమ్మాయిల గురించి, వారినడుమనున్న మైత్రి బంధం గురించి, వారి ఆశలు, ఆశయాల గురించి సాగుతుంది*

*'**కళ్యాణతిలకం**' నవల లోని కథనం.*

*వారి వైవాహిక జీవితాల్లోని ఆనందాలు, వైఫల్యాలు, అరమరికలు, అనురాగాల గురించి సాగుతుంది ఇతివృత్తం*

*ఒకరిది తీర్చలేని వ్యథ, ఒకరి జీవితం ఆనందాల డోలిక, ఒకరి కాపురం కష్టాల కాష్టం, మరొకరిది నిత్యవసంతం గా సాగే సంసారం, వేరొకరికి 'కళ్యాణం' కరిగిపోయే కల.*

*ఐదుగురు అతివల జీవన గాధలని ప్రతిభంబించేదే 'కళ్యాణతిలకం' నవల.*

(గత సంచిక తరువాయి)

అత్తగారింట, కుటుంబ సభ్యుల వ్యక్తిత్వాలని, అలవాట్లని అర్ధం చేసుకుంటూ, ఇష్టాయిష్టాలని తెలుసుకుంటూ, అన్నింటికీ అనుగుణంగా నన్ను నేను చేతనయినంత మలుచుకుంటూ.. దాదాపు ఏడాది సమయాన్ని వేగంగా గడిపేశాను.

నిజమే! నా భర్త నన్ను క్షణం విడిచి ఉండరు. అది ప్రేమో, ఏమో! ఉక్కిరి బిక్కిరి అవుతుంటాను. అత్తమ్మ, మామయ్య గారు నన్ను ఓ బిడ్డలా ఆదరించడం నా అదృష్టమే.

ఆరు నెలల క్రితమే.. బట్లర్ ని, మరో హెల్పర్ ని కూడా మానిపించేసి, వంట మనిషిని జానకిని మాత్రమే పనిలో ఉంచాము. అత్తమ్మకి వంటింట్లో, తోటపనిలో సాయం చేస్తూ ఆమెకి దగ్గరవ్వగలిగాను.

"ఢిల్లీ వాతావరణం, కొత్త కాపురం, కొత్త జీవన సరళి కి అలవాటు పడాలంటే కొంత సమయం పడుతుంది." అని అమ్మానాన్నలతో అన్నప్పుడల్లా తమ్ముడు వంశీ సహా అందరూ నన్ను ఆట పట్టిస్తారు.

అదేమాట నా స్నేహితురాళ్ళతో అంటే “కళ్యాణీ! అతిత్వరలో మీ మొదటి వివాహ వార్షికోత్సవం జరుపుకోబోతూ... ‘అంతా కొత్త అంటే ఎలా?” అంటూ ఊర్మిళ, మాళవి కూడా హాస్యమాడుతారు.

శనివారం పొద్దున్నే వంటింట్లో అత్తమ్మకి సాయం చేస్తుంటే, వచ్చారు అరుణ్.

“కలీ, రేపు శనివారం సాయంత్రం మనం ‘కాస్మోపాలిటన్ క్లబ్’ వారి ఈవెంట్ కి వెళుతున్నాము. నీ చీర, నగలు నేనే సెలెక్ట్ చేస్తాను.” అన్నారు.

‘నన్ను కళ్యాణి అనే పిలవండి. పెద్దవాళ్ళ ఎదుట ‘కలీ’ అంటూ పిలిస్తే నాకు ఇబ్బందిగా ఉంటుందని చెప్పినా వినరు నా భర్త’ అనుకున్నాను.

అరుణ్ ఎంపిక చేసిన గులాబీ రంగు పట్టుచీర కట్టి, కెంపుల హారం, జుంకాలు పెట్టుకున్నాను. నా అలంకారాన్ని మెచ్చుకుంటూ ఓ గులాబీని స్వయంగా నా జడలో పెడుతూ.. “పద, పద. ఆలస్యం కాకూడదు.” అంటూ చేయందుకున్నారు అరుణ్.

ఢిల్లీ మహానగరం లోని ‘కాస్మోపాలిటన్ క్లబ్’ వారి ఆవరణ కిక్కిరిసి ఉంది. మిరుమిట్లు గొలిపే వెలుగులతో నిండి ఉంది లోపలి ఆడిటోరియం. ‘క్లబ్ వార్షికోత్సవం’ లో భాగంగా, ‘వేలంటైన్స్ డే’ సందర్భంగా “అందాల జంట” పోటీలు జరుగుతున్నాయి.

మేము కూడా పోటీలో పాల్గొంటున్నామని ఆఖరి రోజు వరకు కూడా.. అరుణ్ నాకు చెప్పకపోవడం నాకు నచ్చలేదు. కిమ్మనకుండా మోమున చిరునవ్వుతో పోటీలో పాల్గొన్నాను.

తరువాత డిన్నర్ చేసి వెళ్ళి ముందు వరసలో మాకు కేటాయించిన సోఫాలో కూర్చున్నాము. పోటీ ఫలితాల ప్రకటన కోసం అందరూ ఎదురు చూస్తున్నారు.

మ్యూజిక్ ప్రోగ్రామ్ ముగియగానే చేతిలో కవరుతో క్లబ్ ప్రెసిడెంట్ ‘కిషన్ మెహతా గారు వేదిక పై నున్న మైక్ ముందుకొచ్చారు. **“లేడిస్ ఎండ్ జెంటెల్ మెన్,** ఈ సారి **‘అందాల జంట’** అవార్డుని అందుకుంటున్నది ‘**మిసెస్ ఎండ్ మిస్టర్ – కళ్యాణి** మరియు **అరుణ్ కుమార్ రాజా”** అని ప్రకటన చేయగానే మిన్నంటిన కరతాళధ్వనుల నడుమ మమ్మల్ని వేదిక పైకి ఆహ్వానించారు. అవార్డుతో పాటుగా అందరి అభినందనలను అందుకున్నాము.

మైక్ పుచ్చుకుని మాకందిన అవార్డు కి స్పందించారు నా భర్త. “మేము త్వరలో మా మొదటి వెడ్డింగ్ యానివర్సరీ జరుపుకుంటాము. కళ్యాణి ని భార్యగా పొందడం నా అదృష్టమే. హైదరాబాదులో నా కజిన్ పెళ్ళిలో చూసి ‘మొదటి చూపులోనే ప్రేమలో పడిపోయాను.

'లవ్ ఎట్ ఫస్ట్ సైట్ ఫర్ మీ'. కళ్యాణి అందచందాలు, పొడవాటి వాలు జడ, నడవడి చూసి ప్రేమించి, ఆమెని వివాహమాడాను. దేవుడు నాకిచ్చిన గొప్ప బహుమానం నా భార్య." ఎంతో గర్వంగా అన్నారు అరుణ్.

'కాస్మోపాలిటన్ క్లబ్' వారి '**అందాల జంట**' అవార్డు ఆయనకి పట్టలేనంత ఆనందాన్నిచ్చింది.

ఆ వేడుకలో పాల్గొని ఇల్లు చేరేప్పటికి అర్ధరాత్రి దాటింది.

ఆలస్యంగా పడుకున్నా తెల్లారుఝామునే మెలుకువొచ్చేసింది. రాత్రి జరిగిన అవార్డు వేడుక గురించి ఆలోచిస్తూ క్రిందకొచ్చాను. కాఫీ కలుపుకుని వెళ్ళి ఇంటి ముందున్న తోటలోని గజేబోలో కూర్చున్నాను.

రాత్రి ఫంక్షన్ లో నా గురించి, మా పెళ్ళి గురించి అరుణ్ అన్న మాటలు పదేపదే గుర్తొస్తున్నాయి. నిజమే! ఎక్కడో పెళ్లిపందిట్లో నన్ను చూసి, కోరి, వరించి పెళ్లాడారు. వాస్తవానికి, ఆయన తలచుకుంటే నా కన్నా అన్నింటా గొప్ప వధువు సులువుగా దొరికేది. నన్నే ఎందుకు వరించారో అనిపిస్తుంది.

అరుణ్ వంటి భర్త 'పూర్వజన్మ సుకృతమే' అని అందరూ అంటున్నా.. మరి నేనెందుకో, అంతటి ఆనందాన్ని పొందలేక పోతున్నానని, మా వైవాహిక జీవితం పట్ల కొంత ఆవేదన మొదలయిందని గుర్తుకొస్తుంది.

నా పట్ల సౌమ్యత లోపించిన నా భర్త ప్రవర్తనే అందుకు కారణం. 'స్త్రీ పట్ల సుకుమారంగా మెలగాలని తెలియనితనమా? లేక 'ఎదుటి మనిషిని చిత్తుగా ఓడించాలి' అనే ఓ క్రీడాకారుడి ప్రవృత్తితో మసులుకోవడమా?' సున్నితత్వం లోపించిన నా భర్త వైఖరిని భరిస్తూ అతికష్టంగా మెలిగిన క్షణాలెన్నో అని గుర్తుకొస్తుంది.

'ఉత్తమ జంట పోటీ'లో అవార్డు అందుకున్న అరుణ్ ప్రసంగం.. నాలో రేపిన జ్ఞాపకాల అలజడిలో .. పక్కనున్న స్తంభానికి తల ఆన్చి, క్షణం సేపు కళ్ళు మూసాను.

ఇంతలో వెనుక నుండి, "అమ్మాయిగారు, మీ రెండో కప్పు కాఫీ" అంటూ చేతుల్లో ట్రేతో వచ్చిన వంటమనిషి పిలుపుతో కళ్ళు తెరిచాను.

కాస్త దూరాన్నించి అత్తమ్మ కూడా నా వైపుగా రావడం కనబడింది. తరచుగా పొద్దున్నే ఇంటి ముందున్న తోట లోని గజేబోలో కూర్చుంటాము అత్తమ్మ, నేను. దేవునికి పూలమాలలు కడుతూ ఆమె, తొడిమలు తీసి ఆ పువ్వులందిస్తూ నేను కబుర్లు చెప్పుకుంటాము.

ఇవాళ కూడా పూలసజ్జలో రకరకాల పూలు తెచ్చుకుని నా ఎదురుగా కూర్చున్నారామె. "ఏమ్మా, సరిగ్గా రెండు వారాల్లో మీ పెళ్ళి రోజు. వేడుక జరపాలంటే ఇప్పటినుంచే ఏర్పాట్లు మొదలెట్టాలి. కానీ, మీరంతా ఏ హంగామా వద్దన్నారుగా!" అంటూ నావంక చూసి ఆగారు.

ఏమనాలా అని ఆలోచిస్తుండగా.. "సరేలే, ఇంకొక్కమారు అరుణ్ ని అడుగుతాను. అదే జవాబైతే వదిలేస్తాను. ఇక చేయగలిగిందల్లా ఆ రోజు గుడికి వెళ్ళి దేవుడికి అభిషేకం, అక్కడ ఆశ్రమంలో మీ చేత అన్నదానం చేయించడమే." అంటూ పూలబుట్ట నా ముందుంచారు.

మాల కట్టడానికి పూలని వేరు చేయసాగాను. పెళ్ళిరోజు ప్రస్తావన రాగానే, తిరిగి నా ఆలోచనలు అరుణ్ వైపు, మా వైవాహిక జీవితం వైపు మళ్ళాయి.

నిజానికి పెళ్లిరోజు అంటే.. ఆహ్లాదకరమైన సంతోషకరమైన రోజు. భర్త కౌగిలిలో కరిగిపోదామని ఎదురుచూసే బదులు, గుబులు చెందుతుంది నా మనసు. అందమైన జడ అని సవరిస్తూ, అధాట్టుగా జడ పట్టి లాగిన ప్రతీసారి నొప్పితో బాధపడ్డం గుర్తొచ్చింది.

ఓ రోజు, బెడ్ కాఫీ ఇచ్చి వెనుతిరిగిన నన్ను, బలంగా చేయి పట్టి లాగిన విసురికి మంచం కోడు తగిలి బాధతో విలవిల్లాడిపోవడం, ఏడు కుట్లు పడి ఇప్పటికీ ఆ గాయం తాలూకు మాయని మచ్చ గుర్తొచ్చింది.

ఆ రోజునే అత్తమ్మకి విషయాలు చెప్పి, "ఇది సరసమా?" అని ధైర్యం చేసి అడిగి, కంట నీరు పెట్టుకున్నప్పుడు ఆవిడ బాధపడ్డం గుర్తొచ్చింది.

ఏం చేయాలి? ఎవరికి చెప్పుకోవాలి? జీవితాంతం భరించగలనా? అరుణ్ మారుతారా? ఓ పక్క నా వివాహం వల్ల సమాజంలో తమ గౌరవం పెరిగిందని మురిసిపోయే అమ్మానాన్నలతో పాటు తన బావగారు' ఓ పెద్ద హీరో అని భావించే తమ్ముడు. మరో పక్క.. అత్యంత ఆత్మీయంగా ఆదరిస్తున్న అత్తమామలు. నా అస్తవ్యస్త ఆలోచనలు బయటపెట్టి ఎవరినీ నిరుత్సాహ పరచలేను.

'ఎలా నా మనుగడ సాగాలి? నా భర్త మొరటు వైఖరి గురించి నోరు మెదిపే అవకాశమే కరువైపోయింది. అదీకాక గుట్టుగా మెలగడం అలవాటున్న నాకు ఇటువంటి ఇబ్బందికరమైన విషయాలతో బయటపడగలగడం అనూహ్యమే. ఆఖరికి, నా స్నేహితురాళ్ళు ఊర్మిళ, మాళవిలతో కూడా నోరు విప్పి చెప్పుకొనే సాహసం కొరవైంది నాలో.' అని ఆలోచిస్తూ నిట్టూర్చాను.

"ఏమ్మా! అంత దీర్ఘాలోచనలో ఉన్నావు? ఎంత మాలయిందో చూడు. ఇది దేవుడికి వేయి. బటన్ గులాబీలు నీ కోసమే గుత్తిగా కట్టాను. అది నువ్వు పెట్టుకో." అన్న అత్తమ్మ మాటకి ఈ లోకంలోకి వచ్చాను.

వారమంతా ఒంట్లో నలతగా ఉన్న కారణంగా డాక్టర్ వద్ద పరీక్షలు చేయిస్తే, మూడవ నెల గర్భవతినని నిర్ధారణయ్యింది. అత్తమ్మ చాలా ఆనందపడ్డారు. 'గొప్ప శుభవార్త' అంటూ సంబరపడిపోయారు. అరుణ్ లోనూ ఓ కొత్త ఉత్సాహం, సంతోషం కనబడ్డాయి. నాలో మాత్రం ఆ సంగతి తెలిసాక ఓ స్తబ్దత తోచింది.

మా పెళ్ళిరోజు పొద్దున్నే, అత్తమ్మ నాకోసం తీసుకున్న పట్టు చీర కట్టి తయారయ్యాను. అరుణ్, అత్తమ్మ, మామయ్యలతో గుడికి వెళ్ళాను. దేవుడికి అభిషేకం చేయించాక మాచేత అన్నదానం చేయించారు.

కుటుంబంతో ఇలా గుడికి రావడం, పూజలో పాల్గొనడంతో మనసు తేలికయ్యింది.

గుడి నుంచి వచ్చాక లంచ్ చేసి అరుణ్ ఆఫీసుకి వెళ్ళిపోయారు. డైనింగ్ టేబుల్ వద్ద నేను, అత్తమ్మ మిగిలాము.

స్వీట్ తింటూ నేను తల్లిని కాబోతున్న విషయం ఆలోచిస్తున్నాను. మెల్లమెల్లగా నాకూ సంతోషంగానే అనిపించసాగింది. నా మనసులోని చిరాకుల్ని, సమస్యల్ని కొద్దిగా పక్కకు నెట్టి ఎలాగోలా జీవితాన్ని అనుకూలంగా మలుచుకోవచ్చునేమో, అరుణ్ కూడా కొంతైనా మారవచ్చునేమో అన్న చిన్న ఆశ కలుగుతుంది.

మౌనంగా కూర్చుండిపోయిన నన్ను గమనించారు అత్తమ్మ. నా భుజం మీద చేయి వేసి, “నీవు నిస్సంకోచంగా మసులుకో. దేనికైనా నీకు అండగా నేనున్నాను. నీవు క్షేమంగా, ఆరోగ్యంగా ఉంటూ పుట్టబోయే బిడ్డ గురించి ఆలోచించు. ఏది ఎలా కావాలన్నా చేయి. అన్నిటా నీకు పూర్తి స్వేచ్ఛ. దేనికీ
మొహమాట పడవద్దు.” అన్నారామె ఆప్యాయంగా.

సొంత తల్లిలా నా వెన్నంటే ఉంటూ అత్తమ్మ అన్నిటా సాయం చేస్తారు. కుదిరినప్పుడల్లా ఆవిడ కొడుకుతో కబుర్లు చెబుతూ, “ఓ ఇంటివాడవయ్యావు. కాస్త దూకుడు తగ్గించి మృదుత్వం అలవరుచుకోవాలి కన్నా.” అని మందలిస్తారు కూడా.

సాయంత్రం ఇంటికి వస్తూనే నన్ను హడావిడిగా షాపింగ్ కి తీసుకుని వెళ్లారు అరుణ్. పెళ్లిరోజు కానుకగా ఓ చక్కని మామిడి పిందెల రవ్వల నెక్లెస్ కొన్నారు. నా మెడలో వేసి సంబరపడిపోయారు కూడా. రవ్వల జూకాలు, మాటీలు కూడా తీసుకున్నాను.

‘ఇంతలా నన్ను ఆరాధిస్తూ, నన్ను చూసి మురిసిపోయే భర్తని ‘మొరటోడు’గా భావించడంలో… నాదే అపోహేమో అనిపించింది. నా ఆలోచనలోనే తప్పిదం ఉందా?’ అనుకుంటూ నెక్లెస్ కి మాచింగ్ ఉంగరం వెతుకుతుండగా..

“హలో! శ్రీమతి అండ్ శ్రీ అరుణ్ కుమార్ రాజా .. బాగున్నారా?” అన్న స్త్రీ గొంతు విని పక్కకి చూసాను. ఏడాది క్రితం మా పెళ్లి రిసెప్షన్ లో వింతగా మాట్లాడిన యువతి ‘తార నవ్వుతూ కనిపించింది. “హలో” అంటూ గబగబా వచ్చి మా పక్కన కూర్చుంది.

*(కొనసాగింపు వచ్చే నెలలో)*

COMMENTS